క్లుప్తంగా

ఎల్ఈడీ స్క్రీన్‌లపై ప్రమాణ స్వీకార ప్రసారం


సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఆయన మంత్రివర్గ సభ్యులు బుధవారం గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఎల్‌డీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంతో పాటు పేరయ్య కోనేరు ప్రాంగణంలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో టెంట్లు, కుర్చీలు వేసి సౌకర్యాలు కల్పించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పెదపాడు: మండలంలోని వివిధ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పెదపాడు మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 8, 9, 10 తరగతులకు చెందిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంకా కొన్ని తరగతులకు చెందిన కొన్ని పాఠ్య పుస్తకాలను రావాల్సి ఉందని చెప్పారు.

సీహెచ్‌సీలో సిబ్బంది కొరత

దెందులూరు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.70 కోట్లతో సీహెచ్‌సీని 30 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేసింది. ఈ వైద్యశాలకు అంబులెన్స్‌లు, సాంకేతిక వైద్యపరికరాలు, వైద్యులు ఉన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చేసిన అభివృద్ధి కారణంగా వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజుకు 130 నుంచి 150కు పెరిగింది. వైద్యులు ఉన్న వైద్య సేవలందించేందుకు పరీక్షలు చేసేందుకు సిబ్బంది కొరత కనిపిస్తోంది. వైద్యశాలలో ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఆరుగురు శానిటరీ సిబ్బంది, నలుగురు సెక్యూరిటీ గార్డులు అవసరం ఉంది. నూతన ప్రభుత్వం సీహెచ్‌సీకి స్టాఫ్ నర్సులు, శానిటరీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల పోస్టులను నియమిస్తే మరింత మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించేందుకు వీలుంటుందని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం

మేయర్ షేక్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సుందరంగా తీర్చిదిద్దటంలో టౌన్‌ప్లానింగ్ విభాగం, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలది కీలకపాత్రని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో బుధవారం టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులు, సిబ్బంది, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు నగర కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తోన్న అభ్యర్థనలు, ఫిర్యాదులు, నగరంలోని పరిస్థితుల దృష్ట్యా ఈ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. నగరాభివృద్ధితోపాటు కార్పొరేషన్‌కు ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన విభాగమైన టౌన్‌ప్లానింగ్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరటంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడడం, అక్రమ నిర్మాణాలను అరికట్టటం, లేవుట్లలో ఖాళీ స్థలాలను కాపాడడం, అనుమతులిచ్చిన మేరకు నిర్మాణాలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా ? అనే అంశాలతోపాటు శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే శిథిలావస్థ భవనాలను కూల్చివేయటం వంటి బాధ్యతలు ప్లానింగ్ సెక్రటరీలపై ఉందని తెలిపారు. సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు బాధ్యతగా పనిచేయకపోవటంతో నగరంలో చాలా చోట్ల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. ఇళ్లు, భారీ భవనాల నిర్మాణంలో రబ్బీసు రోడ్లపై నెలల తరబడి ఉండిపోవటంతో రోడ్లు, వీధులు అపరిశుభ్రంగా మారిపోతున్నాయని తెలిపారు. భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిస్తున్న నేపథ్యంలో ప్లాన్ సక్రమంగా ఉన్నాయో లేదో విధిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి నిర్మాణంలోనూ విధిగా ఇంకుడుగుంతలు ఉండేలా చర్యలు చేపట్టాలని మేయర్ నూర్జహాన్ అన్నారు. అక్రమణలతో రోడ్లు విశాలంగా లేకపోవటంతో ప్రధాన కూడళ్లు అభివృద్ధి చేయలేకపోతున్నామని, వీటి కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. ఏలూరు నగరంలో పార్కులను సుందరీకరణ, అగ్నిప్రమాదాల నివారణ, శ్మశాన వాటికల అభివృద్ధిలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు కీలకపాత్ర పోషించాలన్నారు. రోడ్ల పక్కన హోర్డింగులు పెరిగిపోయినా ఆదాయం తగినంతగా కార్పొరేషన్‌కు రావటంలేదని వాపోయారు. నగరంలోని హోర్డింగులకు పన్నులు వసూలు చేసి ఆదాయాన్ని పెంచుతూ, నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో నగర అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, సెక్రటరీ దివ్యకుమారి, ఏసీపీ తిరుపతిరావు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు.


కార్పొరేషన్‌లో సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్, చిత్రంలో కమిషనర్ వెంకటకృష్ణ

గుండుగొలను జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు


క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

భీమడోలు: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్లే వాహనాలతో బుధవారం ఉదయం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై రద్దీ నెలకొంది. రాజమండ్రి, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వాహనాలు గన్నవరం వైపుగా వెళ్తుండడంతో ఒక్కసారిగా గుండుగొలను వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గన్నవరం వైపు వెళ్లే వాహనాలకు పోలీస్ ఆంక్షలు విధించి, వాహనాలను నిలుపుదల చేయించారు. పాసులున్నా వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతులు ఇచ్చారు. మిగిలిన వాహనాలను నిలుపుదల చేశారు. గుండుగొలను జంక్షన్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను పంపారు.

హామీలన్నింటినీ అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల్ని రాజకీయ వివక్షతకు తావులేకుండా తక్షణం అమలు చేయాలని కోరారు. సూపర్ సిక్స్ గ్యారంటీలే కాకుండా ప్రజలకు ఇచ్చిన ఇతర సంక్షేమ పథకాలతో పాటు వాస్తవిక ప్రజాభివృద్ధికి తోడ్పడే అభివృద్ధి హామీల అమలుకు పూనుకోవాలని అన్నారు. మొత్తం 76 రకాల షెడ్యూల్ ఎంప్లాయిస్ కార్మికులకు కనీస వేతనాల జీఓలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం ఉద్యోగ, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పండగ సెలవులు వంటి సౌకర్యాలతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారిని రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల బీఓసీ బోర్డును పునరుద్ధరించాలని, గత ప్రభుత్వాలు వాడుకున్న బీవోసీ నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్ సహా క్యాబ్, లారీ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించాలని, జీఓ 21ని రద్దు చేయాలని కోరారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన కారణంగా నష్టపోబోయే ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. హమాలీ, ముఠా, జట్టు తదితర అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి వారికి ఉద్యోగ భద్రతతో పాటు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిలిపివేతకు పూనుకోవాలని, గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్ని అదానీకి అప్పగించిన గత ప్రభుత్వ ఒప్పందాల్ని రద్దు చేయాలని కోరారు. ప్రత్యేక హోదాతో సహా రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్యాకేజీలు, రైల్వే జోన్స్ వంటి రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న అన్ని హామీల అమలు కోసం, మూసివేసిన జూట్ మిల్లులు, ఇతర పరిశ్రమల్ని తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు బద్దా వెంకట్రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు మంగరాజు రాము, గడసాల రాంబాబు, మంగం అప్పారావు, డి.వీరినాయుడు, కాకర్ల శ్రీను, ఎన్ నెహ్రూబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇఫ్టూ సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు తాడేపల్లిగూడేనికి చెందిన అల్లూరి సురేష్‌కుమార్ బుధవారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, చెత్త సేకరణకు 49 పుష్ కార్ట్స్‌ను కొనుగోలు చేశామని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పుష్ కార్ట్స్‌ను నగరంలోని ఆయా సర్కిల్స్‌కు మేయర్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 16 సర్కిల్స్‌లో సుమారుగా 700 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. ఇంటింటా చెత్త సేకరణకు ఉపయోగించే (4బిన్) ట్రాలీలకు చక్రాలు సరిగా పనిచేయక, ట్రాలీల్లో చాలా వరకు మరుగునపడ్డాయని తెలిపారు. వాహనాలు వెళ్లని ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ కోసం నగరపాలక సంస్థ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి 49 పుష్ కార్ట్స్ కొనుగోలు చేశామన్నారు. వీటిని పారిశుధ్య కార్మికులకు అందజేశామని తెలిపారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడిచెత్త వేరువేరు డబ్బాల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు ఉన్నారు.


పుష్‌కార్ట్స్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నూర్జహాన్, కమిషనర్ వెంకటకృష్ణ

పైపైకి కూరగాయల ధరలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశంలో చుక్కల్ని చూస్తుండడంతో.. వాటిని కొనేందుకు ప్రజలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బుధవారం స్థానిక రైతుబజారులో కూరగాయల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోయారు. స్థానిక రైతు బజారుల్లో టమాటాలు కిలో జూన్ 3వ తేదీన రూ.40 ఉండగా, జూన్ 5న 52, బుధవారం రూ.52కు విక్రయించారు. కాకరకాయలు కిలో రూ.44 నుంచి 50కు ఉల్లిపాయలు రూ.30 నుంచి రూ.38కు, బీరకాయలు రూ.44 నుంచి రూ.60, కాప్సికమ్ రూ.70 నుంచి రూ.98కి, అల్లం రూ.160 నుంచి 180కి, కొత్తిమీర కట్ట రూ.30 నుంచి రూ.50కి, తోటకూర, పాలకూర, చుక్కకూర వంటి ఆకు కూరలు కట్ట రూ.12 నుంచి రూ.15కు పెరిగిపోయాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ధరలు పెరుగుదలపై వారు పెదవి విరుస్తున్నారు. ఈ ధరలు పెరుగుదలను అరికట్టాలని కోరుతున్నారు.


పత్తేబాద రైతుబజారు

15 నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి వర్మ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏలూరులో నిర్వహించే రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని పాతబస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతాంగ సమస్యలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. మహాసభలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు. ఈనెల 16న రైతాంగ సమస్యలపై మేధావులతో సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్ లలిత కుమారి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గిరిజనుల జాతర

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన మెరకగూడెంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సోదెం, రవ్వా వంశీయుల ఇలవేల్పుల జాతర ముగిసింది. ఆదివాసీలైన సోదెం, రవ్వా వంశీయులు ఈ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వంశీయులు భక్తిశ్రద్ధలతో కొలిచే పేన్ కర్రలకు మూడు రోజులపాటు పూజలు చేశారు. అనంతరం ఈ పేన్ కర్రలను భుజాన ఎత్తుకుని వంశీయులు వివిధ ప్రాంతాల్లో బంధువుల మధ్య ఆటపాటలతో, డోలు నృత్యాలతో సందడి చేశారు. ఈ జాతర యాడమర్రులతో, కోయ సంస్కృతి ఆచార వ్యవహారాలతో వైభవంగా నిర్వహించారు. ఈ జాతర మహోత్సవంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన వారికి నిర్వాహకుడు సోదెం సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జ్ఞానారెడ్డి

చింతలపూడి: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని చెప్పినట్లు జ్ఞానారెడ్డి తెలిపారు. తామంతా వైఎస్ జగన్ వెంటే ఉంటామని 2029లో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకు వస్తామని చెప్పినట్లు ఆమె వివరించారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ పదవికి నీలిమ రాజీనామా

భీమడోలు: భీమడోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ తన పదవికి రాజీనామా చేశారు. సంబంధిత పత్రాలను ఉన్నతాధికారులకు బుధవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు చైర్‌పర్సన్‌గా ఆమె పని చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో వ్యక్తిగత బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశానన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి వారి కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా తన వంతు కృషి చేశారని గుర్తుచేశారు. జగన్ హయాంలో 2019 నుంచి మార్కెట్ సెస్ కింద రూ.11.20 కోట్లు, సివిల్ సప్లయీస్ శాఖ నుంచి రూ.7 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. మండలంలో రూ.4 కోట్లతో బీటీ రోడ్లు, రూ.3 కోట్లతో పుంతరోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ పదవికి తగిన న్యాయం చేసేందుకు కృషి చేశానన్నారు. ఈ సందర్భంగా వాసుబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహాల ముసుగు తొలగింపు

దెందులూరు: దేశంలో ఎన్నికల కోడ్ ఎత్తివేస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించి నాలుగు రోజులు కావస్తున్నా గ్రామాల్లో నాయకుల విగ్రహాల ముసుగులు తీయడం లేదు. అన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ ముగిసినా పంచాయతీ ఉద్యోగులు స్పందించకపోవడంతో బుధవారం శ్రీరామవరంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, నాయకులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతంపేటలో సైతం వైఎస్సార్ సీపీ నాయకులు దివంగత వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


శ్రీరామవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలదండ వేసిన దృశ్యం

పొడపాము హల్‌చల్

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అన్నమాచార్య విగ్రహం వద్ద ఒక పొడపాము బుధవారం ఉదయం హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళితే.. చినవెంకన్న దర్శనార్థం భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ గుండా ఆలయంలోకి వెళుతున్నారు. ఆ సమయంలో క్యూ కాంప్లెక్స్ పక్కన అన్నమాచార్యుని విగ్రహం వద్ద గార్డెన్‌లోకి ఒక పొడపాము ప్రవేశించింది. నీటిలో వెళుతున్న ఆ పామును చూసి అక్కడున్న భక్తులు భీతిల్లారు. అయితే పాము పక్కనే ఉన్న మొక్కల్లోకి వెళ్లిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.


అన్నమాచార్య విగ్రహం వద్ద గార్డెన్‌లోని నీటిలో వెళుతున్న పొడపాము

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	58	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	108
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	07, 10
బెండకాయలు	34	కంద	64
పచ్చిమిర్చి	64	బీట్‌రూట్	40
కాకర కాయలు	48-56	కీరా దోస	44
బీరకాయలు	60	ఫ్రెంచ్‌బీన్స్	120
బీరకాయలు (పందిరి)	--	అల్లం	180
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	25-50
క్యారెట్	40-52	పాలకూర	15
దొండకాయలు	26	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	98
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	40